సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 20 । జూన్ । 2023



కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ-3 జీఎం

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 జీఎంగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్‌రావు సోమవారం కలెక్టర్ సంగీతను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. అడిషన్ కలెక్టర్, డీసీపీని కలిసి పలు అంశాలపై చర్చించారు.



పత్తి క్వింటాల్‌కు రూ.6,900

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు సోమవారం రూ.6,900 పలికిందని ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. కనిష్టంగా రూ.6,087, సగటున రూ.6,751గా నమోదైందన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/31.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి.
ఉక్కపోత పెరుగుతుంది.

గోదావరి ఒడ్డే డంపింగ్ యార్డు

రామగుండం కార్పొరేషన్‌లో 50 డివిజన్లు.. సుమారు 2.50 లక్షల జనాభా ఉంటుంది. 93 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన బల్దియా నుంచి రోజుకు 115 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. అయితే చెత్త పోసేందుకు మాత్రం డంపింగ్ యార్డులేదు. దీంతో చెత్తను తాత్కాలికంగా గోదావరి నది ఒడ్డున డంప్ చేస్తుండడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఆ చెత్తను కాలుస్తుండడంతో కాలుష్యం పెరిగి, పొగ, దుర్వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతేడాది భారీ వరదలు రావడంతో చెత్తంతా నదిలో కొట్టుకపోయింది. ఫలితంగా జలకాలుష్యం ఏర్పడి ప్రజలు రోగాల బారిన పడ్డారు. వేల ఎకరాల ఖాళీ స్థలాలు ప్రభుత్వరంగ సంస్థల చేతుల్లో ఉన్నా.. ప్రజల సౌకర్యార్థం పదెకరాలు కూడా ఇచ్చేందుకు సింగరేణి సహా ఇతర సంస్థలేవీ ముందుకు రావడం లేదు. నగరపాలక సంస్థ విన్నపాలకు మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా ఇటు పాలకులుగానీ, అటు పాలకవర్గంగానీ ఈ చెత్త సమస్యకు పరిష్కారం చూపకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బల్దియాల్లో చెత్త సమస్య

మంథని, రామగుండం మున్సిపల్‌లో కనిపించని స్థలం

- వ్యర్థాలను గోదావరి నది ఒడ్డునే పోస్తున్న వైనం
- పొగ, దుర్వాసనతో ప్రజలకు తప్పని తిప్పలు
- తడి, పొడిచెత్త నిర్వహణలో మున్సిపాలిటీల నిర్లక్ష్యం



రోడ్డుపైనే పారబోత

ఈ చిత్రంలో రోడ్డుపక్కనే చెత్త డంపింగ్ చేసి కనిపిస్తున్నది మంథని మున్సిపాలిటీలోనిది. మంథని మున్సిపాలిటీగా రూపాంతరం చెందినప్పటికీ డంపింగ్‌యార్డు లేకపోవడంతో ప్రతిరోజూ సేకరించే సుమారు 18 టన్నుల చెత్తను మంథని–కాటారం రహదారి వెంబడి.. పట్టణ శివారులో డంప్ చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించకుండా అంతా కలిపేస్తుండడం.. అనంతరం కాల్చివేయటం పరిపాటిగా మారింది. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో పట్టణీకరణ అంతకంతకూ పెరిగిపోతోంది. జనాభా, ఆధునిక జీవనశైలికి తగినట్లు బల్దియాల్లో వాతావరణ పరిస్థితులను మార్చాలంటే అది వందశాతం పారిశుధ్యం నుంచే మొదలుకావాలి. పట్టణాల్లో జనాభా ఏటా పెరిగిపోతుండగా.. నిత్యం టన్నుల కొద్దీ చెత్త వెలువడుతోంది. అయితే ఆ చెత్తను డంప్ చేయడానికి మాత్రం రామగుండం, మంథనిలో స్థలాలు లేవు. ఫలితంగా గోదావరి ఒడ్డున, రోడ్డుపైనే పోస్తున్నారు. జిల్లాలోని బల్దియాల్లో చెత్తను నిర్దిష్ట విధానంలో రీసైక్లింగ్ చేయకపోవడంతో డంపింగ్‌యార్డుల్లో టన్నుల కొద్దీ పేరుకుపోతోంది. ప్రభుత్వం నూతన మున్సిపాలిటీ చట్టం తెచ్చినప్పటికీ.. పట్టణాల్లో నిత్యం వెలువడే చెత్తను రీసైక్లింగ్ చేసి పర్యావరణానికి మేలు జరిగేలా ఎరువుల తయారీ చేపట్టకపోవడంతో సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. జిల్లావ్యాప్తంగా బల్దియాల్లో రీసైక్లింగ్ చర్యలు అరకొరగానే సాగుతున్నాయి.

గాడి తప్పిన తడి, పొడి చెత్త ప్రక్రియ..

నిత్యం ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. తడిచెత్త ద్వారా ఎరువు, పొడిచెత్త ద్వారా కార్మికులు ఆదాయం పొందవచ్చు. తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ రామగుండం కార్పొరేషన్ పరిధిలో కాగితాలకే పరిమితం అవుతోంది. స్వచ్ఛ సర్వేక్షణ్ తడి, పొడిచెత్త నిర్వహణతోపాటు బహిరంగ మల, మూత్ర విసర్జన, మురుగు నిర్వహణ కూడా కీలకం. కేవలం పొడి చెత్త నిర్వహణ చేపడుతున్న అధికారులు.. తడి చెత్తపై చేతులెత్తేశారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేయడానికి అవసరమైన అన్ని వనరులూ ఉన్నప్పటికీ.. ఆ దిశగా అడుగులు మాత్రం ముందుకుపడటం లేదు. తడి చెత్తతో ఎరువులను తయారు చేసి నర్సరీలకు వాడుతున్నట్లు తప్పుడు నివేదికలు తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ చేసేందుకు గౌతమినగర్, ఎన్టీఆర్‌నగర్, జ్యోతినగర్‌లో షెడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ, అవి వినియోగానికి నోచుకోలేదు. రెండేళ్ల క్రితం ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు. సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాలను నిర్వహించి కొంత ఫలితం సాధించారు. తర్వాత ఈ ప్రక్రియ నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. రామగుండంతోపాటు జిల్లాలో ఉన్న పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో వాహనాల్లో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తున్నారు. నేరుగా డంపింగ్ యార్డులకు తరలించి చేతులు దులుపుకుంటున్నారు. రీసైక్లింగ్ ప్రక్రియను పట్టించుకోకపోవడంతో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. ఆ చెత్త కుప్పలను కాల్చడంతో పొగ కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్లను వివరణ కోరగా.. డంపింగ్ యార్డుల స్థలసేకరణకు సింగరేణికి లేఖ రాశామని చెప్పారు. తడి, పొడి చెత్త సేకరణ, సెగ్రిగేషన్ షెడ్ల వినియోగంపై వివరణ కోరగా.. చెత్తద్వారా ఆదాయం పొందేలా, షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రామగుండంను 'రూడా'గా ప్రకటించాలి

- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్



జోడోయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా (రూడా) గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయాలని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. సోమవారం రాత్రి కార్పొరేషన్ 4వ డివిజన్‌లో పార్టీ ఎన్టీపీసీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా ఆధ్వర్యంలో హాథ్‌సేహాథ్ జోడో అభియాన్ యాత్రలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రతో బీజేపీ, బీఆర్ఎస్‌లో వణుకు మొదలైందన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రధాని మోదీ కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య అంతరాలు సృష్టించారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ధ్వంసం అవుతోందని, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగుతోందని పేర్కొన్నారు. కర్ణాటక తరహాలోనే ఇక్కడా పార్టీ అధికారంలోకొస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు మహంకాళీ స్వామి, ఎండీ.ముస్తఫా, గాదం విజయ, నాయకులు మహమ్మద్ భాయ్, సాగర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మురళీకృష్ణ, ప్రకాశం, ముచ్చకుర్తి రమేశ్, ఈదునూరి రవి, ధూళికట్ట సతీష్, కొటం సతీష్, సిరిశెట్టి సతీష్, పంజా శ్రీనివాస్, సమ్మెట స్వప్న, నల్లాల జ్యోతి, దేవేందర్ రెడ్డి, మేకల పోశం, రాజేశం, రవీందర్ రెడ్డి, ప్రసాద రావు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదినం

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మక్కాన్‌సింగ్ ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు కాల్వ లింగస్వామి, రవికుమార్, బొమ్మక రాజేశ్, ఫకృద్దీన్, పెండ్యాల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు ఆదివరాహస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వేడుక



శ్రీఆదివరాహస్వామి ఆలయం

కమాన్‌పూర్(మంథని): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి సన్నిధిలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత, ఈవో కాంతరెడ్డి తెలిపారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు, కళ్యాణం, అన్నమయ్య కీర్తనలు, మహిళల కోలాటం ఆటలు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారంతో ముగిశాయని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. ఫస్టియర్ పరీక్షలకు 50శాతం, సెకండియర్ పరీక్షలకు 81.3శాతం విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తంగా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

ట్రినిటిలో నేడు క్యాంపస్ రిక్రూట్‌మెంట్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. టాస్క్, ఆన్ స్కూల్ ఆధ్వర్యంలో ఎంపిక ఉంటుందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని కాలేజీల్లో బీటెక్, ఎంబీఏ చదివిన.. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు హాజరుకావాలని కోరారు. రెండు సెట్ల ధృవీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ గణేశ్, ఏట సురేశ్, హెచ్‌ఓడీలు ఆరిఫ్, నటరాజన్, కౌసల్య, స్వాతి, ప్రభాకర్, రాజిరెడ్డి ఉన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



భూమిపూజ చేస్తున్న సునీత

సుల్తానాబాద్: మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఎంపీపీ బాలాజీరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. బలహీనవర్గాలు అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. మాజీ ఎంపీపీ ఐల రమేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, మహనీయుల ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరు కైలాసం, కుమ్మరి సంఘం రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు తొర్రికొండ శ్రీనివాస్, విగ్రహ ప్రతిష్ఠ కమిటీ చైర్మన్ ఉస్తేం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎండీ.హకీం, మంద శ్రీనివాస్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు వేగోళం శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

భారతి స్వామికి ఘన స్వాగతం



ఆలయంలోకి వస్తున్న భారతి స్వామి

మంథని: మంత్రపురికి చేరుకున్న శృంగేరి శివగంగా శారద పీఠాధిపతి పురుషోత్తమ భారతీస్వామికి మంగళవారం రాత్రి ఘన స్వాగతం లభించింది. రెండురోజుల సందర్శనలో భాగంగా ఇక్కడకు వచ్చిన ఆయనకు స్థానిక గాంధీచౌక్ వద్ద బ్రాహ్మణులు మంగళహారతులు, మంగళవాయిద్యాలతో శోభాయాత్ర ద్వారా శ్రీశీలేశ్వర సిద్ధేశ్వర ఆలయానికి తీసుకెళ్లారు. మంగళవారం గోదావరి నదిలో స్నానం అనంతరం గౌతమేశ్వర దేవాలయంలోపాటు పట్టణంలోని ప్రధాన ఆలయాల సందర్శన, ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

మొక్కలు నాటాలి.. సంరక్షించాలి



పాలకుర్తిలో నాటిన మొక్కకు నీరుపోస్తున్న రామగుండం ఎమ్మెల్యే చందర్, కలెక్టర్ సంగీత

- జిల్లాలో 8 కోట్లకు పైగా మొక్కలు
- హరితోత్సవంలో కలెక్టర్ సంగీత
- పాల్గొన్న ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్

పాలకుర్తి: ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని, కలెక్టర్ సంగీత అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం బసంత్‌నగర్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని కన్నాల అటవీబ్లాక్ ప్రాంతంలో హరితోత్సవంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి పాల్గొన్నారు. మొక్కలు నాటి నీరు పోశారు. పచ్చదనం పెంపునకు చేపట్టిన కార్యక్రమాలపై రూపొందించిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు. ఎనిమిదేళ్లుగా జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటి పెంచుతున్నట్లు వివరించారు. జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందుకు కాలుష్యం కూడా విపరీతంగా ఉంటుందని, దీని నియంత్రణకు మొక్కల పెంపకం అవసరమని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 235 ఎకరాల్లో పల్లెప్రకృతి వనాలు, 388 ఎకరాల్లో బృహత్ పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేసి మియావాకి పద్ధతిలో మొక్కలు నాటినట్లు వివరించారు. ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ హరితహారంతో 7.7శాతం గ్రీన్‌కవర్ పెరిగినట్లు కేంద్ర అటవీశాఖ పేర్కొందని గుర్తు చేశారు. అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం ఆవశ్యకత అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, డీఎఫ్‌వో శివయ్య, డీఆర్‌డీవో శ్రీధర్, డీపీవో చంద్రమౌళి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు నాగయ్య, శ్రీనివాస్‌రావు, జెడ్పీటీసీ నారాయణ, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీవో యాదగిరి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హరిత తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం

ఫెర్టిలైజర్‌సిటీ: ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే చందర్ అన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో మొక్కలు నాటి



హరితోత్సవంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సెల్ఫీ దిగారు. కార్పొరేటర్లు పద్మ, కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, బాలరాజ్ కుమార్, నాయకులు తోడేటి శంకర్ గౌడ్, దొమ్మేటి వాసు, కొలిపాక మధుకర్ రెడ్డి పాల్గొన్నారు.

మరోమారు పండ్ల మొక్కల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి నియోజకవర్గంలో ఇంటింటికీ పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాల్వశ్రీరాంపూర్‌లో పాఠశాల చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రా రెడ్డి, సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, ఎంపీటీసీ సువర్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చదనంతో సస్యశ్యామలం

సుల్తానాబాద్‌రూరల్: హరితహారంతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందని ఎమ్మెల్యే దాసరి అన్నారు. మండలంలోని గ్రామాల్లో హరితోత్సవంలో పాల్గొన్నారు. ఎంపీపీ బాలాజీరావు, రైతుబంధు జిల్లా కో–ఆర్డినేటర్ అనంతరెడ్డి, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు వీరగోని సుజాత, అధికారులు పాల్గొన్నారు.

ఆహ్లాదాన్ని పంచేందుకే హరితోత్సవం

పెద్దపల్లిరూరల్: విరివిగా మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం పెంచాలని ఎమ్మెల్యే దాసరి అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, మార్కెట్ చైర్మన్ జడల సురేందర్, జెడ్పీటీసీ రామ్మూర్తి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్యతో కలిసి మొక్కలు నాటారు.

కార్పొరేషన్ ఈ–మెయిల్ దుర్వినియోగం

- అజ్ఞాత వ్యక్తులు మెయిల్‌ను ఉపయోగించిన వైనం
- సీడీఎంఏ, ఏసీబీ, విజిలెన్స్‌కు వెళ్లిన ఫిర్యాదులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన
- సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు
- బల్దియాను కలవరపెడుతున్న వరుస ఘటనలు



రామగుండం కార్పొరేషన్ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్‌కు గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపు లేఖ పంపించిన ఘటన మర్చిపోకముందే.. కార్పొరేషన్ అధికారిక ఈమెయిల్, కార్యాలయంలోని కంప్యూటర్ల నుంచి అజ్ఞాత వ్యక్తులు మెయిల్స్ పంపించడం కలకలం సృష్టిస్తోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన బల్దియాలో సోమవారం చర్చనీయాంశంగా మారింది.

సీడీఎంఏ, ఏసీబీ, విజిలెన్స్, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

కార్పొరేషన్‌లోని ఓ విభాగంలోని కంప్యూటర్లను అజ్ఞాతవ్యక్తులు అక్రమంగా ఉపయోగించినట్లు అనుమానిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ పేరుతో ఉన్న అధికారిక ఈ–మెయిల్ దుర్వినియోగం చేసినట్లు తేలింది. కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై పలు దినపత్రికలు ప్రచురించిన పేపర్ క్లిప్పింగ్‌లతోపాటు పలు కీలకమైన ఆధారాలను అధికారిక ఈ–మెయిల్ ద్వారా 15 రోజుల క్రితం ఏసీబీ, విజిలెన్స్, సీడీఎంఏతోపాటు జిల్లా ఉన్నతాధికారుల మెయిల్స్‌కు గుర్తు తెలియని వ్యక్తులు పంపించారు.

అప్రమత్తమైన అధికారులు

బల్దియా అధికారిక ఈ–మెయిల్ నుంచి అవినీతి, అక్రమాలపై వచ్చిన వార్త కథనాలు, ఇతర ఆరోపణలతో కూడిన ఆధారాలు ఉన్నతాధికారుల ఈ–మెయిల్స్ రావడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయం తెలియడంతో బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. పది రోజుల క్రితమే పాస్‌వర్డ్‌ను మార్చడంతోపాటు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పాస్‌వర్డ్ ఎలా తెలిసింది..?

బల్దియాలో కొందరికి మాత్రమే తెలిసిన పాస్‌వర్డ్ బయటి వారికి ఎలా తెలిసింది..? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారని సమాచారం. కార్యాలయంలో ఎవరైనా అధికారిక ఈ–మెయిన్‌ను లాగౌట్ చేయకుండా వెళ్లిన సమయంలో అజ్ఞత వ్యక్తులు దుర్వినియోగానికి పాల్పడ్డారా..? ఆ అజ్ఞాత వ్యక్తులకు, బల్దియాలోని ఉద్యోగులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా..? అసలు ఏ విభాగంలోని కంప్యూటర్ ద్వారా ఈ–మెయిల్ దుర్వినియోగం అయ్యింది..? కంప్యూటర్ ద్వారానా..? స్మార్ట్ ఫోన్ ద్వారా అప్‌లోడ్ చేశారా..? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారని సమాచారం. ఈ తాజా సంఘటన అటు అధికారులతోపాటు ఇటు ఉద్యోగులను సైతం వణికిస్తోంది.

సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

బల్దియా అధికారిక ఈ–మెయిల్ దుర్వినియోగం అయినట్లు వచ్చిన ఫిర్యాదుపై సైబర్ క్రైం పోలీసులు సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నారని సమాచారం. ఏయే కంప్యూటర్లను ఉపయోగించారు..? ఏ రోజు, ఏ సమయంలో అధికారిక ఈ–మెయిల్ ద్వారా అప్‌లోడ్ అయ్యింది..? అనే వివరాలను సదరు ఈ–మెయిల్ సంస్థ నుంచి సేకరిస్తున్నారని తెలిసింది.

దళితులకు మూడెకరాలు ఎక్కడా..?



కార్యకర్తలతో విజయ రమణారావు

సుల్తానాబాద్: దళితులకు మూడెకరాలు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ ఏమైందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు ప్రశ్నించారు. పట్టణంలోని 4వ వార్డులో ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. వేగోళం అబ్బయ్య గౌడ్, సాయిరి మహేందర్, మీస సత్యనారాయణ, పర్శ రాములు, దున్నపోతుల రాజయ్య, ఎండీ.రఫిక్, చింతల రాజు, కుమార్ కిషోర్, నోముల శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి ఉన్నారు.

బల్దియాకు ఉత్తమ సేవా అవార్డు



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న మేయర్ అనిల్‌కుమార్



ప్రశంసాపత్రం అందుకుంటున్న సర్పంచ్ నరేష్‌రావు, కార్యదర్శి నవీన్

కోల్‌సిటీ/మంథని: హరితహారంలో రామగుండం కార్పొరేషన్‌కు ఉత్తమ సేవ అవార్డు వచ్చింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన హరితోత్సవంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి చేతులమీదుగా నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అవార్డు అందుకున్నారు. బల్దియాలో విస్తారంగా మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించడానికి తీసుకున్న మెరుగైన సేవలకు ఈ అవార్డును ప్రకటించినట్లు అధికారులు వెల్లడించారు.

దుబ్బపల్లికి ఉత్తమ సేవ పురస్కారం

హరితోత్సవంలో భాగంగా మంథని మండలం దుబ్బపల్లి పంచాయతీ ఉత్తమ సేవా పురస్కారం అందుకుంది. గ్రామంలో టీకెహెచ్‌హెచ్‌ని విజయవంతంగా అమలు చేసినందుకు రాష్ట్ర హోం మంత్రి మహమ్మూద్ అలీ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ నరేష్‌రావు, జూనియర్ పంచాయతీ కార్యదర్శి నవీన్ పురస్కారం, ప్రశంసా పత్రం అందుకున్నారు.

క్లుప్తంగా

బాధితుడికి ఆర్థికసాయం



సుమన్‌కు నగదు అందిస్తున్న సర్పంచ్ సరిత

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రానికి చెందిన పందిల్ల సుమన్ కొద్ది రోజుల క్రితం జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. అతని ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు సోషల్ మీడియా వేదికగా సేకరించిన రూ.70 వేలను సోమవారం సర్పంచ్ నీలం సరిత చేతులమీదుగా సుమన్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఛత్రపతి యువసేన అధ్యక్షుడు జంగపెల్లి శ్రీనివాస్, కొమ్ము శ్రీనివాస్, కమ్మగోని అనిల్, కూనారపు సతీశ్, శ్రీనివాస్, రెడ్డి చైతన్య, బండి సంతోష్, శంకర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పన్నూర్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మ

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలంలోని పన్నూర్‌లో మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సర్పంచ్ అల్లం పద్మ సోమవారం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీ తీస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. సాయంత్రం ఇంటింటికీ వెళ్లి, విద్యుత్ పొదుపుగా వాడుతున్నారా లేదా పరిశీలించారు. ఈ శిబిరం వారం రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెరువు శ్రీధర్‌రెడ్డి, పీడీ పింగిలి కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణం ప్రగతినగర్‌లో కొంతం మల్లేశంకు చెందిన గడ్డివాముకు సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో దగ్ధమైంది. మంటలు చెలరేగుతున్నాయని సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ తన సిబ్బందితో వచ్చి, ఆర్పివేశారు. సమీపంలోని ఇళ్లలో ఉన్నవారు పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

అవగాహనతో సత్ఫలితాలు

- గ్రామాల్లో ప్రశాంతతకు పోలీసుల కృషి
- ప్రతి కూడలిలో సీసీ కెమెరాల ఏర్పాటు
- ఓదెల మండలంలో తగ్గుముఖం పడుతున్న నేరాలు



పొత్కపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

ఓదెల(పెద్దపల్లి): గ్రామాల్లో ప్రశాంతత కోసం, నేరాలు తగ్గుముఖం పట్టేందుకు ఓదెల మండలంలోని పొత్కపల్లి పోలీసులు గ్రామసభలకు శ్రీకారం చుట్టారు. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో 22 గ్రామాల్లో వీటిని నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, గంజాయి విక్రయాలను అరికట్టడం, యువతను చెడు అలవాట్లకు దూరం చేయడం, నకిలీ విత్తనాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల, హరిపురం, పొత్కపల్లి, ఉప్పరపల్లె, కొలనూర్, మడక గ్రామాల్లో గ్రామస్తులకు అవగాహన కల్పించి, వారితో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. గత ఏప్రిల్‌లో 13, మేలో 15, జూన్‌లో ఇప్పటివరకు 17 కేసులు నమోదైనట్లు ఎస్సై తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రైల్వేస్టేషన్ల గ్రామాలైన ఓదెల, కొలనూర్, పొత్కపల్లి గ్రామాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలను ఎవరైనా రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు తమ కుమారులు మత్తుకు బానిసలవకుండా ఎప్పుడూ వారిని గమనిస్తూ ఉండాలని చెబుతున్నారు.

100కు ఫోన్ చేయాలి..

మహిళలు, విద్యార్థినులు పోకిరీల నుంచి వేధింపులు, లైంగిక దాడులను ఎదుర్కొంటుంటే 100కు ఫోన్ చేయాలని గ్రామసభల్లో సూచిస్తున్నారు. దీంతో ఈ నంబర్‌కు ప్రతినెలా 130 వరకు కాల్స్ వస్తున్నాయని పోలీసులు తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలు రవాణా చేసినా, విక్రయించినా 100కు సమాచారం ఇవ్వాలంటున్నారు. నేరాల నియంత్రణకు పొత్కపల్లి పోలీసుల చొరవ పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దొంగతనాలు తగ్గాయి



పొత్కపల్లి ఎస్సై గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులతో ప్రజల్లో చైతన్యం పెరిగింది. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు గతంతో పోలిస్తే తగ్గాయి. షీటీం సభ్యులు మహిళలకు మానసిక ధైర్యానిస్తున్నారు.
– దొడ్డె స్వామి, కాంగ్రెస్ నాయకుడు, కొలనూర్

క్రమశిక్షణ పెరిగింది



పొత్కపల్లి పోలీసులు గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలతో ప్రజల్లో క్రమశిక్షణ పెరిగింది. యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చేస్తున్న ప్రచారాన్ని వారు ఏకాగ్రతతో వింటున్నారు.
– వంగ శ్రీనివాస్, ఉపసర్పంచ్, పొత్కపల్లి

అధిక ఫీజులను నియంత్రించాలి

- అడ్మిషన్ పేరిట రూ.500 వసూలు
- ఎన్టీపీసీ యాజమాన్యానికి బాబర్ సలీంపాషా ఫిర్యాదు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో సంస్థ సహకారంతో కొనసాగుతున్న సెయింట్ క్లేర్ హైస్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తోందని, వాటిని నియంత్రించాలని ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యులు బాబర్ సలీంపాషా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌కు సోమవారం పరిపాలనా భవనంలో వినతిపత్రం అందించారు. స్కూల్ యాజమాన్యం నిబంధనలు అతిక్రమిస్తోందన్నారు. రెండు, మూడేళ్లుగా పాఠశాలలో విద్యాప్రమాణాలు సంతృప్తికరంగా లేవని తెలిపారు. పోషక కమిటీ సమావేశాలు నిర్వహించడం లేదని, ఎల్‌కేజీ పిల్లలకు రూ.18వేలు, అడ్మిషన్‌కు ఫారానికి రూ.500 వసూలు చేస్తున్నారని తెలిపారు. అడ్మిషన్ ప్రక్రియ పూర్తిగా గజిబిజీగా మారిందని, పారదర్శకత పాటించడంలేదని పేర్కొన్నారు. ఎన్టీపీసీ సంస్థపై ఆధారపడిన పిల్లలకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, బయటి వ్యక్తులకు చెందిన చాలామంది పిల్లలకు అడ్మిషన్లు ఇస్తున్నారని విమర్శించారు. పిల్లల విద్యాసక్తిని దృష్టిలో ఉంచుకుని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తక్షణ జోక్యం చేసుకోవాలని సూచించారు. సంస్థ ఉన్నతాధికారులు సదరు పాఠశాలలో జరుగుతున్న పరిస్థితిని సమీక్షించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరారు.

యూపీఎస్సీ ర్యాంకర్‌కు సీపీ అభినందన



అభినందిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: యూపీఎస్సీ 51వ ర్యాంకర్ అన్నాడి మధుసూదన్‌రెడ్డిని సీపీ రెమా రాజేశ్వరి సోమవారం అభినందించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లికి చెందిన అన్నాడి నరసింహారెడ్డి,సుజాత దంపతుల చిన్న కుమారుడు మధుసూదన్‌రెడ్డి యూపీఎస్సీ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ అలిండియాలో 51వ ర్యాంక్ సాధించారు. జాతీయ స్థాయి సైక్లింగ్ క్రీడాకారుడిగాను మధుసూదన్‌రెడ్డి గుర్తింపు సాధించాడు. సీపీ మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి యూపీఎస్సీలో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. అతడిని ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): బీజేపీకి చెందిన పలువురు నాయకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పిన, పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందినవారు గులాబీ దళంలో చేరుతుండటం హర్షణీయమన్నారు. దండి అజయ్, పసుపులేటి రాము, ముదురుకోళ్ల రాజు, కుమారస్వామి, అనూష, రాజేశ్వరి, కళావతి, లక్ష్మి, రామమ్మ, వెంకటమ్మ, దివ్య, రజిత, అనిల్, రాఘవ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ శిరీష, సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు దేవయ్య, కో–ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఉప సర్పంచ్ కరుణారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురవుతున్న విద్యుత్ తీగలు



పిల్లిపల్లె సమీపంలో స్తంభంపై విప్పిన విద్యుత్ తీగలు

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని పిల్లిపల్లె సమీపంలో విద్యుత్ సరఫరా లేని విద్యుత్ తీగలు చోరీకి గురవుతున్నాయి. కమాన్‌పూర్ సబ్‌స్టేషన్‌కు గతంలో పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ లైన్ ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరా చేశారు. కానీ ప్రస్తుతం దానికి గుండారం వద్ద ఏర్పాటు చేసిన 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. రాఘవాపూర్ నుంచి కమాన్‌పూర్ వరకు ఉన్న 33 కేవీ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో స్తంభాలకు ఉన్న విలువైన వైరుతోపాటు స్తంభాలు సైతం చోరీకి గురవుతున్నాయని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

మద్యం మత్తులో యువకుడి బలవన్మరణం



రాహుల్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని బంజేరుపల్లికి చెందిన కల్లెపెల్లి రాహుల్ (17) మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాహుల్ తండ్రి శంకరయ్య ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోగా తల్లి పద్మ కూలి పనులు చేసుకుంటూ కుమారుడు, కూతురిని పోషిస్తోంది. రాహుల్ ఎనిమిదో తరగతిలోనే చదువు మానేసి, పేయింటింగ్ పనులకు వెళ్తున్నాడు. కూతురు మల్లాపూర్ గురుకులంలో పదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగిన రాహుల్ ఆ మత్తులో ఇంట్లోనే చీరతో ఉరేసుకున్నాడు. గతంలో భర్తను, ఇప్పుడు కుమారుడిని కోల్పోయిన పద్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ చెట్టును ఢీకొని ఒకరు మృతి



శ్రీనాథ్ మృతదేహం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి గ్రామానికి చెందిన గాజుల శ్రీనాథ్(21) మృతిచెందాడు. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనాథ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో పని నిమిత్తం సోమవారం నారాయణరావుపల్లి నుంచి బైక్‌పై గొల్లపల్లి వెళ్తున్నాడు. మార్గమధ్యలో చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రామస్వామి, నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలోని మున్నూరు కాపుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్క రామస్వామి, యూత్ కన్వీనర్ ఆకుల స్వామివివేక్ పటేల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందించారు. రాష్ట్ర జనాభాలో 24 శాతం ఉన్న తమకు ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం అందడం లేదన్నారు. మున్నూరుకాపుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ చొరవ చూపాలని కోరారు. నాయకులు రామస్వామి, దేవేందర్, వైద తిరుపతి, తూముల శ్రీనివాస్, శంకరయ్య, రాజేశ్, చంద్రయ్య, రామచంద్రం తదితరులున్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఆర్జీ–3, ఏపీఏల్లో ఘనంగా హరితోత్సవం



మొక్క నాటి, నీరు పోస్తున్న జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు

కమాన్‌పూర్(మంథని): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హరితోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జీ–3 జీఎం కార్యాలయ ఆవరణలో జీఎం ఎస్.సుధాకర్ రావు, ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు మొక్కలు నాటి, నీళ్లు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై, మొక్కలు నాటి, సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్, సింగరేణి సీఎండీ, డైరెక్టర్ల దిశానిర్దేశంతో సింగరేణిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఏరియా ఇంజినీర్లు ఎలిషా, సీతారామం, ఫైనాన్స్ జీఎం శ్రీనివాస్, ఏరియా సర్వే అధికారి జైనులాబుద్దీన్, పర్సనల్, సివిల్ డీజీఎంలు విలాస్ శ్రీనివాస్ పొద్దార్, పద్మరాజు, సీనియర్ ఎస్టేట్ అధికారి ఐలయ్య, ఐటీ డెప్యూటీ మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో మొక్కలు నాటాలి



మొక్క నాటి, నీరు పోస్తున్న జీఎం శ్రీనివాస్



మొక్క నాటుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు పారిశ్రామిక ప్రాంతంలో భారీగా మొక్కలు నాటాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణకు హరితోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఇందుకోసం సింగరేణి యాజమాన్యం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, ఏటా లక్షలాది మొక్కలు నాటుతోందన్నారు. సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్‌రాజ్, చీఫ్ ఆఫ్ సెక్యూరిటీ బి.హన్మంతరావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంవోఏఐ అధ్యక్షుడు పొనగోటి శ్రీనివాస్, అన్ని విభాగాల ఇన్‌చార్జిలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఆర్జీ–2 జీఎం

గోదావరిఖని(రామగుండం): తెలంగాణకు హరితోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్జీ–2 జీఎం కార్యాలయ ఆవరణలో జీఎం మనోహర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఏటా లక్షలాది పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు నాటుతోందని, వాటి రక్షణను చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అధికారులు మధుసూదన్, రవీందర్, సురేష్‌బాబు, రాజేంద్రప్రసాద్, టీబీజీకేఎస్ నాయకులు ఐలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్రీడీ లేజర్ స్కానర్ వినియోగంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): సర్వే విభాగంలో ప్రవేశపెట్టిన అత్యాధునిక త్రీడీ లేజర్ స్కానర్ వినియోగంపై శిక్షణను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, కార్పొరేట్ సర్వే జీఎం గోవర్ధన రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఐదు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఓబీ, బొగ్గు నిల్వలను కొలిచేందుకు టోటల్ స్టేషన్ పరికరం వినియోగించేవారని తెలిపారు. దీనివల్ల 8 నుంచి 10 రోజులు పట్టేదన్నారు. ఈ త్రీడీ లేజర్ స్కానర్ ద్వారా కచ్చితమైన సర్వే తక్కువ సమయంలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. సంస్థలో 6 త్రీడీ లేజర్ స్కానర్లు కొనుగోలు చేశామన్నారు. కొత్తగూడెం, రామగుండం, బెల్లంపల్లి సర్వే అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, సర్వే సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఏరియా సర్వే ఆఫీసర్ పి.ప్రభాకర్, డీజీఎం సర్వే రాఘవేంద్రరావు, సర్వేయర్ రవీందర్ పాల్గొన్నారు.

'ఖని'లో నలుగురు దొంగల అరెస్టు

- నాలుగున్నర తులాల ఆభరణాలు, బైక్, ఆటో స్వాధీనం



అరెస్టు చూపుతున్న సీఐ ప్రమోదర్‌రావు

గోదావరిఖని(రామగుండం): స్థానిక బస్టాండ్ వద్ద నలుగురు దొంగలను సోమవారం అరెస్టు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోదర్‌రావు తెలిపారు. ఆటోలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని పోలీసులు ఆపి, తనిఖీ చేయగా నాలుగున్నర తులాల బంగారు, వెండి ఆభరణాలు లభించాయన్నారు. వెంటనే అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా సులభంగా డబ్బు సంపాదించాలని ఇటీవల కొన్ని ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన ఐత వెంకటేశ్, ఫైవింక్లయిన్‌కు చెందిన బెజ్జంకి పృథ్వీరాజ్, జ్యోతినగర్‌కు చెందిన రేణికుంట రవితేజ, తిలక్‌నగర్‌కు చెందిన తాడబోయిన సాయికృష్ణ అంగీకరించారని తెలిపారు. నలుగురినీ అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఆభరణాలతోపాటు బైక్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దొంగలను పట్టుకున్న ఎస్సై రమేశ్, ఏఎస్సై మల్లయ్య, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు గోపతి వెంకటేశ్, తీట్ల శ్రీనివాస్, కనకం సురేషలను సీఐ అభినందించారు.

నేడు విద్యాదినోత్సవం : కలెక్టర్

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. మన ఊరు మనబడి పనులు పూర్తయిన 21 పాఠశాలలను ప్రారంభిస్తున్నామన్నారు. విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి, రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత విద్యారంగ ప్రగతిని వివరించే కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వివిధ పోటీల్లో ప్రతిభచూపిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల స్థాయినుంచి కళాశాలస్థాయి వరకు ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం, ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సత్కారం ఉంటుందని వివరించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం వంగపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలోని అన్నపూర్ణకాలనీకి చెందిన కుమ్మరికుంట సాయిరాం (22) సోమవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయిరాం సికింద్రాబాద్‌లోని కవాడిగూడలో ఓ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని కిలోమీటర్ నంబర్ 252, 27–29 ఎగువ లైన్‌లో వరంగల్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన ట్రాక్‌మెన్‌లు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అతడి వద్ద లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా సాయిరాంగా గుర్తించారు. అతడికి వివాహం కాలేదని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లిబియాలో చొప్పదండివాసి..

- అప్పుల బాధే కారణమన్న స్థానికులు

చొప్పదండి: పట్టణానికి చెందిన తాళ్లపల్లి మోహన్ లిబియా దేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందింది. బతుకుదెరువు కోసం వలస వెళ్లిన అతను అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు తెలిపారు. మృతదేహం కోసం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. మోహన్ కుటుంబసభ్యులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం సోమవారం పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్ తదితరులున్నారు.